## కథ

# ప్రతిబింబాలు

**యద్దనపూడి సావిత్రి**

**శీతల టేబుల్‌పై నున్న ఆల్బమ్‌ని చేతిలోకి తీసుకుంది. రకరకాల వేషాల్లో తన చిట్టి తండ్రి శివాజీ.**

**అందర్నీ ఆకర్షించే ఫోటోలు రెండు. ఒకటి- వాడికి శివాజీ వేషం వేసి బొమ్మ గుర్రంపై కూచోబెట్టి తీసిన ఫోటో.. ఓ చేతిలో అట్టతో చేసిన కత్తితో కోపంగా తలెగరేసినట్టు. అది వాడి అయిదో సంవత్సరంలో తీసిన ఫోటో.**

మరొకటి- గాంధీ. ఇది వాడి నాలుగో ఏట తీసింది.

తిరుపతి మొక్కు.. శుభ్రంగా గుండు. అసలే వాడి చెవులు పెద్దవి. అందుకే వాడికి గాంధీ వేషం వేస్తే అనిపించింది. వాళ్ల నాన్నగారి కళ్లద్దాలు కోసం పేచీ లేక తనకంటూ కళ్లజోడు వచ్చిందని వాడికెంత సంబరమో! కాకపోతే పంచె కట్టుకుని ఓసారి కూలబడిపోయాడు. వాడికి చాక్లెటిచ్చి ఓదార్చింది తను. మరో రెండ్రోజుల్లో స్కూల్ డే. కొల్లాయి గట్టి, చిన్న కర్ర చేతికిచ్చి అచ్చం గాంధీలా ఫాన్సీడ్రెస్ వేయించింది నర్సరీ టీచర్ వందన. పోటీలో తన చిట్టి తండ్రిదే ఫస్ట్ ప్రైజ్.

వాడెంతో గర్వంగా ఫీలయ్యాడు. ఇంటికొచ్చేప్పుడు ఆ కొల్లాయి తీయద్దని గొడవ. అలాగే కారెక్కాడు. ఇంటికొచ్చాక తీయనీయలేదు. కొల్లాయితోపాటు కళ్లద్దాలూ తీస్తారని భయం. అలాగే నిద్రపోయాడు. వారం రోజులు అందరికీ ఒకటే మాట...''నా పేరు శివాజీ కాదు గాంధీ'' అంటూ.

ఆ ఆటలూ పాటలూ అంతా గతం. చిగురు వేసి సంగీత సాధనలో మునిగిన కోయిల వేటగాడి బాణానికి కూలినట్లు వసంత శోభతో స్వాగతిస్తున్న పూదోట పెనుతుఫాన్‌లో వికలమైనట్లు జీవితంలోకి భరించరాని శూన్యం తలుపు తట్టకుండానే వచ్చింది.

కన్నీళ్ల జ్ఞాపకాల పుటల్ని స్పృశించి నిలువరిద్దామన్నా నిలువడం లేదు. మౌనంగా ఆమె వెనక్కి వచ్చి నిలబడ్డ శ్రీధర్ దృష్టి ఆమె చేతిలోని ఆల్బమ్‌పై పడింది.

గాంధీలా తన చిట్టి తండ్రి శివాజీ.. కరిగిపోయిన గతంలా. ఒక్కసారి తల విదుల్చుకున్నాడు. శీతల ఇంకా కుంగిపోతుంది తన కన్నీళ్లు చూస్తే అనుకున్నాడు.

''శీతలా! బయల్దేరుదాం. పదింటికి వస్తామని చెప్పాను'' అన్నాడు.

శీతల తలెత్తి భర్త వంక చూసింది. భుజం చుట్టూ చెయ్యేసి ఆమెని దగ్గరికి తీసుకున్నాడు శ్రీధర్. ఆమెకే తెలుసు అతడు తన దుఃఖాన్ని కనురెప్పల చాటునే దాచుకున్నాడు. అందుకే మెల్లిగా అతడి నుండి విడివడి లోపలికెళ్లి పది నిమిషాల్లో తయారై వచ్చింది.

కారు మెల్లిగా సికింద్రాబాద్ వైపు సాగుతోంది. కిటికీలోంచి మౌనంగా బయటికి చూస్తోంది శీతల. వెనక సీట్లో భార్యతో పాటే కూచున్న శ్రీధర్ కళ్లు మూసుకున్నాడు.

★ ★ ★

ఖచ్చితంగా ఇవాల్టికి సంవత్సరం.. డిసెంబర్ 26.

ఎప్పుడూ షూటింగ్‌లతో బిజీగా ఉండే తను సంవత్సరానికి ఓ పది రోజులు అచ్చంగా ఫామిలీతో గడిపే రోజులూ. అదీ శివాజీ పుట్టిన రోజు కలిసొచ్చేలా ప్లాన్ చేసుకుంటాడు. శీతలకి అలాగే ఇష్టం.

పోయిన సంవత్సరం డిసెంబర్. ఈసారి తను తీయబోయే సినిమాకి స్క్రిప్ట్ సిద్ధం కాలేదు. కనుక మరో పది రోజులు హాయిగా కుటుంబంతో గడపాలనుకున్నాడు.

శీతల కేరళ ట్రిప్ వేద్దాం అంది. ఆమె చిన్నతనం అక్కడ గడిచింది. అందుకే ఆమెకి కేరళ, తమిళనాడు చాలా ఇష్టం. తనూ ఓకే చేశాడు. కేరళ రాష్ట్రంలోని పచ్చదనం, కొబ్బరిచెట్లు, చిన్నపాయలుగా సాగే కాలువలూ బోట్ల షికారు తనకి చాలా ఆనందాన్నిస్తాయి.

తిరువనంతపురంలో ఓ చిన్న హోటల్‌లో నదీతీరానికి దగ్గరగా గడపాలనుకున్నారు. ఆ రోజు శివాజీ పుట్టినరోజు కూడా. వాడు ఇరవై ఐదు అర్ధరాత్రి పుట్టాడు. హోటల్లోని ఇతర పర్యాటకులతో, సిబ్బందితో కలిసి చాలా గ్రాండ్‌గా వాడు పుట్టిన రోజు సెలబ్రేట్ చేశారు. ఇరవయ్యారు ఉదయం బీచ్‌లో కూచుని ఆడుతున్నాడు వాడు.

తను దూరంగా నిలబడి ఈసారి షూటింగ్‌కి ఈ ప్రాంతం ఎంతవరకూ పనికొస్తుంది అని ఆలోచిస్తున్నాడు. వాడు తనవైపు పరుగెత్తుకొచ్చాడు.

''నాన్నా! నేను గాంధీ కదా!'' వాడికి గాంధీ వేషంలో ప్రైజ్ వచ్చినప్పటి నుండీ వాడికి గాంధీ అనిపించుకోవాలని కోరిక.

''నీ పేరు శివాజీ కదా!'' అన్నాడు తను వాడిని అనుకరిస్తూ.

''ఊహు, నేను చిన్న గాంధీ. నన్ను సినిమా తియ్యవా?''

వాడి ఆలోచనకి నాకు ఆశ్చర్యం వేసింది. గాంధీ వేషం బాగా కుదిరింది గనుక తనని చిన్న గాంధీలా చూపిస్తూ సినిమా తియ్యాలట. మరి నిర్మాతని అడగకపోతే ఎవర్ని అడుగుతాడు. నవ్వుకున్నాను. ''అలాగే, నీవు ఇంకొంచెం పెద్దవాడివి కావాలి. అప్పుడు తీద్దాం'' వాడికి అలా చెప్పి వెనుతిరిగి హోటల్ వేపు అడుగులు వేశాడు. వాడు మళ్లీ బీచ్ వేపు పరుగెత్తాడు.

తనింకా హోటల్ చేరలేదు. హోరున శబ్దం. లీలగా ''నాన్నా!'' వెనుదిరిగేసరికి ఉవ్వెత్తున అలలు - శత్రు శిబిరంపైకి దాడిలా.

ఏడీ శివాజీ?.. అంత దూరాన అలలతో బాటు.. తను ముందుకురికాడు. కానీ బలమైన అలలు వాడిని ఎంతగా లోపలికి లాగాయో తనని అంతగానూ దూరం తోశాయి.

అందరూ పరుగులు.. పరుగులు.. హోటల్లోంచి అంతా పరుగులు.. తమ కోసం శీతల పరుగెత్తుతూ వస్తోంది. ఎలా... కొంచెం ఉధృతం తగ్గింది. ఎలాగోలా అలలతో పోరాడుతూ వెనక్కిపోయిన తను శీతలని చేరాడు. ఆమె అప్పటికే స్పృహ తప్పింది. ఆ తరువాత అంతా శూన్యంగా మారింది మరణ మృదంగాలతో.

ఎలా తిరిగి వచ్చారో ఓ కల. అర్ధరాత్రి వరకూ ఆనందహేల బ్రతుకు. ఆ ఉదయం వస్తూ వస్తూ కరాళ నృత్యం చేస్తూ తమ చిన్నారిని జలప్రళయంలో సమాధి చేసింది.

★ ★ ★

ఇంటి ముందు వరండాలో లాంతరు పెట్టి వీధి చివర వరకూ వెళ్లి చూసొచ్చింది సుక్కమ్మ. సాయంత్రం నుంచీ ఆమె మనసులో గుబులు బయలుదేరింది. మధ్యాహ్నం కల్లా వచ్చి ఇంత అన్నం తిని మళ్లీ నాలుగ్గంటలకి జంక్షన్ కాడికి వెళ్లే లక్ష్మన్న ఇంకా రాలేదు. వాడి తోటి వాళ్లంతా వచ్చేశారు. దూరంగా ఉన్న మైదానంలో వీధిలైటు వెలుగులో ఒకరినొకరు ముట్టించుకునే ఆట ఆడుకుంటున్నారు. పోనీ వాళ్లనైనా అడుగుదామంటే అంతా తలా ఒక జంక్షన్ దగ్గర నిలబడతారు. అప్పటికే పోశాలు కొడుకును అడిగింది లక్ష్మన్న కోసం. వాడు జంక్షన్ కాడ కూచుని బూట్ పాలిష్ అని

అరుస్తుంటాడు.

''చిన్నీ! ఇయాల ఎవరో మినిస్టరు ఆడకొస్తున్నారని అందర్నీ ఎల్లగొడితే నాను మైసమ్మ గుడి ముందు గూకున్నా. లక్ష్మన్న అటుకెల్లి రాలే'' అని చావు కబురు చల్లగా చెప్పాడు.

సుక్కమ్మ గుండెల్లో రాయి పడింది. ఆ జంక్షన్ కాడి నుంచి యాడికి పోయిండో ఆమె ఊహకి అందలేదు. అందుకే కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది.

రాత్రి ఎనిమిదయినా లక్ష్మన్న జాడ లేదు. గుమ్మంలో కూచుని కరువుదీరా ఏడవడం మొదలుపెట్టింది. రాను రానూ ఆ రాగం ఎక్కువైంది. సుక్కమ్మ దుఃఖమంత జోరుగా వాన కూడా కురవడం మొదలుపెట్టింది.

ఈలోగా పోశాలు వచ్చింది. ముసల్ది కొవురమ్మని గూడా వెంట బెట్టుకుని వచ్చింది.

''ఏటే! ఇంకా రాలేదేటి బుట్టడు?'' అంటూ ఆదరంగా అడిగింది. సుక్కమ్మ ఆమెని వాటేసుకుని బావురుమంది. కొవురమ్మ అరుగుపై సతికిలబడింది. ఆ ముసల్దానికి అర్థమైపోయింది లక్ష్మన్న గల్లంతయ్యాడని.

''ఏటి సేసుద్ది? ఇద్దరు బిడ్డలాయె. మగడు. ఆగమాయె. మిల్లు మూతబడి పనిలేకపోయె. ఏం బెట్టి పిల్లల్ని సాకుద్ది?'' అంది పోశాలు.

''ఏం చేసేదత్తా! ఇంటి కిరాయెల్లాలి, బువ్వకెల్లాలి, అంతా కరువేనాయె. బుట్టడ్ని బడి కంపదీనికి పైసలు లేకపోయె. కడుపు నిండా బువ్వలేదు. బడికాడ బోతడు?'' అంటూంటే మళ్లీ ఆమెకి దుఃఖ పొంగుకొచ్చింది. ''బతకమ్మ బిడ్డ అమ్మోరి పటం బట్టుకుని సెకందరాబాదు టేసను కాడ అడుక్కుంటుంది. అది జూసి ఈడు రెండు దినాలు బాయె. ఇద్దరూ ఓ కాడుంటే ఇద్దరికీ పైసలెవరేస్తరు? అందుకే ఈడు జంక్షన్ కాడ నిలబడుతన్నాడు'' అని విషయం వివరంగా చెప్పింది ముసల్దానికి.

''సుక్కీ! నువ్వేడ్వకు. నాను జూసొస్త'' అంటూ పోశాలు ముసల్దాన్ని అక్కడ ఉండమని తన గుడిసె కాడికెళ్లింది. కొడుక్కీ కూతురికీ జాగ్రత్తగా ఉండమని జెప్పి జంక్షన్ కాడికి బయలుదేరింది.

ఓ మైలు దూరం నడిచి, దక్షిణ వీధి గుండా పోతే మరో మైలు దూరం నడిచి వంతెన దాటితే జంక్షనే. గబగబా నడుస్తోంది పోశాలు. మెయిన్ రోడ్పై సగం దూరం పోయేసరికి పోలీస్ జీప్.

''ఆగు'' అంటూ అరిచాడు కానిస్టేబుల్.

పోశాలు ఆగింది. ''ఎటు పోతున్నావ్?'' అంటూ గద్దించాడు జీపులో కూచున్న ఎస్సయి.


''జంక్షన్ కాడికి బోతున్న'' అంది పోశాలు.

''అక్కడ ఏదో మీటింగ్ అవుతున్నది. చాలా జనం ఉన్నారు. మినిస్టర్ గూడా వస్తున్నాడు. వెనక్కి పో'' అన్నాడు జీపు ప్రక్కన నిలబడ్డ కానిస్టేబుల్.

ఇక లాభం లేదనుకుని పోశాలు వెనక్కి తిరిగింది. ఆమె మళ్లీ సుక్కమ్మ దగ్గరికి వెళ్లేసరికి సుక్కమ్మ కూతురు భారతి తల్లిని గంజి తాగమని బ్రతిమాలుతోంది. సుక్కమ్మకి ఆ గంజి విషంలా కనిపించింది. గంజి నీళ్లు కూడా పోయలేని తను నిండా ఆరేళ్లు లేని కొడుకుని జంక్షన్ కాడ అడుక్కోమందని ఆమె అంతరాత్మ ఎగతాళి చేస్తోంది.

''నువ్వు తాగు'' అంది కూతురిని.

''రాతిరేళ కదా! పొద్దుగాల బొమ్మని పోలీసాయన అరిసినాడక్కా'' అంది పోశాలు.



''దీదీ! మీ అన్నకి జొప్ప, బేటా ఏడకి బోతాడు? దోస్తుల కాడున్నాడేమో! మనమొక్కల్మే అడుక్కుంటున్నామా? ఇనాంటి పోరలింకుండరు గదా! యాడనో ఉంటడు'' అంటూ ఏడుస్తున్న సుక్కమ్మని ఓదార్చి గంజి తాగించింది రేష్మ. సుక్కమ్మకి అదీ నిజమేననిపించింది. ఈ పది రోజుల్లో వాడికి దోస్తులయ్యారేమో.

అందరూ తలా ఓ మాటా ధైర్యం చెప్పి ఎవరి గుడిసెకి వాళ్లు వెళ్లిపోయారు. చేసేది లేక సుక్కమ్మ కూతురితో పాటు పడుకుంది. ఎప్పటికో గానీ ఆమెకి నిద్ర పట్టలేదు.

సుక్కమ్మ నిద్రలో- గాంధీ తాత వచ్చాడు. కానీ ఆయన ఫోటోలోలా లేడు. ఆయన ఒంటి నిండా పంచె, భుజాల నిండుగా ఉత్తరీయంతో ఉన్నాడు. సుక్కమ్మ చలికి వణుకుతోంది. ఆయనకి జాలేసిందేమో! తన ఉత్తరీయం నడుంకి చుట్టుకుని తన పంచె ఆమెకి కప్పాడు. ఏం మాట్లాడకుండానే గుమ్మం వైపు పోతున్నాడు. పోతూ పోతూ చిన్నగా అయి పోతూ పోతూ ఒక్కసారిగా లక్ష్మన్నలా మారి బయటికి పోయాడు.

''లచ్చన్నా! ఆగరా'' అంటూ లేచి కూచుంది సుక్కమ్మ. అక్కడెవరూ లేరు. చుట్టూ చూసింది. భారతి తల్లి వైపు కాళ్లు జాపుకుని పడుకుంది. తల్లీ తనూ కలిసి కప్పుకున్న పాత చీర నిద్రలోనే చలికి తన వైపు లాక్కుందేమో. తల నుంచి పాదాల దాకా కప్పుకుని హాయిగా పడుకుంది.

అయితే ఇదంతా కలా?

గాంధీతాత రావడం కూడా కల. తను చలిలో వణకడమూ కలే. కలలోనూ తను కొడుకుని చూసింది. మళ్లీ దుఃఖం ముంచుకొస్తోందామెకు.

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన రచన**

కానీ కన్నీళ్లు గూడా కరువయ్యాయి. బాధతో నీళ్లు కంట్లోనే గడ్డ కట్టాయేమో!

తెలవారే వరకూ తెరలు తెరలుగా సుక్కమ్మకు గాంధీతాత కలలు వస్తూనే ఉన్నాయి. ఆమె కళ్లు తెరిచేసరికి రేష్మ, పోశాలూ గుడిసె ముందు తజ్జాడుతున్నారు. ఆమె లేవడం చూసి రేష్మ భర్తని కేకేసింది.

''నోట్లో నీళ్లు పోసుకుని ఊసెయ్యి. రాత్రి వెళ్లి పరేషాన్లున్నావు. ఒక టీ తాగు'' అంటూ పోశాలు టీ తెచ్చింది. సుక్కమ్మ తల అడ్డంగా ఊపింది.

''చాయ్ తాగక్కా! ఆటోలో జంక్షన్ కాడికి గొంటబొతి'' అన్నాడు ఇస్మాయిల్. అతడు ఆటో నడుపుతాడు. సుక్కమ్మ అందరి బలవంతంపైన చాయ్ తాగింది.

ఇస్మాయిల్, పోశాలు సుక్కమ్మని తీసుకుని జంక్షన్ కాడకి వెళ్లారు. సుక్కమ్మని ఎందుకో ఇంకా రాత్రి కల వెంటాడుతోంది. సుక్కమ్మ ఆటోకి ముందుగా గాంధీతాత నడుస్తూ నడుస్తూ లక్ష్మన్నలా మారిపోతున్నాడు. జంక్షన్ అల్లంత దూరంలో ఉండగానే ఆటో ఆపాడు ఇస్మాయిల్.

''వస్తు. ఈడ జర పనుంది'' అంటూ రోడ్డు పక్కగా నున్న పాన్‌షాపు దగ్గరికెళ్లాడు.

''ఈడ నిన్న పోరడు గనిపించిండా భాయ్? ఆ చౌరస్తా కాడ అడుక్కుంటడు'' అని అడిగాడు.

''ఎట్లుంటడు?'' అన్నాడు కిళ్లీ షాపతను.

''సునేర్ పూసుకుంటడు. గుండు'' అన్నాడు ఇస్మాయిల్.

''ఎవరు? గా... గాంధీ తాతనా?'' అన్నాడు కిళ్లీ షాపతడు.

''ఔ. నిన్నటికెల్లి రాలేదని ఆని తల్లి పరేషాన్ అయితంది'' అన్నాడు ఇస్మాయిల్. అతడికీ ప్రశ్నలు ఆందోళన కల్గిస్తున్నాయి.

''ఏదో గాడీ కొట్టినుండె. పెద్దోలెవరో గా పోరని ఆ మూలకాడున్న దవాఖాన్లకి గొండబోయిన్రు'' తల ముందుకు చాచి మూల చివర ఎడమవైపున్న ప్రైవేటు నర్సింగ్ హోమ్ వైపు చూపించాడు ఆ షాపతడు. ఇస్మాయిల్ గిరుక్కున వెనక్కి తిరిగి ఆటోని ముందుకు తీసుకెళ్లాడు.

''నా కొడుకేడి అన్నా!'' అడిగింది సుక్కమ్మ గుండె గుబేలుమంటుంటే.

''జర బీమార్‌గున్నదని దవాఖానాకి గొండబోయినట'' అన్నాడు ఇస్మాయిల్. అతడే ఆ నర్సింగ్‌హోమ్ రిసెప్షన్‌లో సుక్కమ్మ కొడుకుని వర్ణించి చెప్పి వివరాలు అడిగాడు.

''ఇందరా? ఒకరో ఇద్దరో నాతో రండి'' అంటూ నర్సు వార్డ్ని తీసుకెళ్లింది.

★ ★ ★

ఓ గదిలో బెడ్‌పైన సుక్కమ్మ కొడుకు...కాలుకి కట్టుతో. అతడి ప్రక్కలో కూచుని పాలు అద్ది బ్రెడ్ పెడుతోందో అందమైన స్త్రీ.

''మేడమ్! ఈ పిల్లవాడి తల్లిట'' అంటూ ఆ యువతికి సుక్కమ్మని చూపింది నర్సు.

ఆ యువతి- శీతల. తలత్రిప్పి చూసింది. పేదరికం గూడు కట్టుకున్న బక్కచిక్కిన ఆ దైన్యమూర్తిని చూడగానే ఆమె మనసు ఆర్ద్రమైంది. తలత్రిప్పి పడుకున్న ఆ పిల్లాడి వైపు చూసింది. ''అమ్మా!'' అంటున్న ఆ పెదవులపై నవ్వు, కళ్లల్లో ఆనందం ఆమె హృదయాన్ని కరిగించాయి. మెల్లగా తను లేస్తూ ఆమెని కూచోమన్నట్టు చేయి చూపింది.

సుక్కమ్మకి కొడుకును అలా చూడగానే రాత్రి కల మళ్లీ గుర్తొచ్చింది.

''ఏమాయెరా బిడ్డా!'' అంటూ కొడుకుని పట్టుకుని ఏడిచింది. శీతలకి ఆమెని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. పోశాలు సుక్కమ్మని ఊరుకోబెట్టింది.

''అమ్మగోరు! ఏమాయె మా బుట్టడకి?'' అంది పోశాలు.

''నిన్న సాయంత్రం మేం కారులో వెళుతున్నాము. జంక్షన్ దగ్గర పెద్ద గుంపు. యాక్సిడెంట్ అంటున్నారు. ఏమయిందో? అనుకుంటూ దిగాము. ఈ అబ్బాయిని స్కూటర్ కొట్టిందిట. ఆ స్కూటర్ వేగానికి దెబ్బకి ఎగిరిపడ్డాడు. మోకాలికి బాగా దెబ్బ తగిలింది. మూతి దగ్గర కూడా దెబ్బ తగిలింది. మాకు వెంటనే ఏం చెయ్యాలో తెలీలేదు. ఈ ఆసుపత్రిలో జేర్చాం'' అంది శీతల. ఆమెకి ఇంకా ఆ దృశ్యం కళ్ల ముందు కదులుతోంది.

గుండు... సునేరు పూసుకున్న గాంధీతాత. దూరంగా ఉత్తుత్తి కళ్ళద్దాలు. మూతికి అంటిన రక్తం తుడుచుకున్న చేత్తోనే ఆ రూపాయి కళ్లద్దాల కోసం దేకుతున్న దుర్బల శరీరం.... దూరంగా చిన్న కర్ర.

ఆమెకి తన చిట్టి తండ్రి శివాజీ కళ్ల ముందు మెదిలాడు. ''నా పేరు శివాజీ కాదు- గాంధీ'' అంటూ.

అది తన చిన్నతండ్రి వేసిన ఫాన్సీ వేషం కాదు.

తన చిన్న పొట్ట నింపుకోవడానికి ఓ పసివాడు వేసిన బ్రతుకు వేషం.

తనని తనలాటి నిస్సహాయులనూ గుర్తించని సమాజం మేలుకోవాలని వేసిన జాతిపిత వేషం. ఆ జాతిపిత ఎంత గొప్పవాడో వీడికి తెలుసా? ఆకలేసే కడుపుకి ఆదర్శపు పాఠాలు ఎవరు చెబుతారు వీళ్లకి? శీతల భుజంపై చెయ్యి పడటంతో తలెత్తి చూసింది. ఆమెకే తెలీకుండా స్రవిస్తున్న అశ్రుధారలని తుడుస్తున్నాడు శ్రీధర్.

''గరీబోల్లం. బువ్వ లేక ఆడ గాంధీతాతోలె నిలబడతాండు ఈడు. అమ్మా! మీరు పెద్దోల్లు. నా బిడ్డని కాపాడిన్రు'' అంటూ దణ్ణం పెట్టింది సుక్కమ్మ.

''నీ కొడుకుని బడికి పంపు. రోడ్డు మీద నిలబడి ఇట్లా ప్రమాదాల పాలైతే ఎట్లా?'' అన్నాడు శ్రీధర్.

శీతల భర్త వైపు చూసింది. ఆ చూపులో 'వాళ్ల స్థితి చూస్తున్నాం. అలా అడిగితే ఎలా? మనవంతుగా ఏం చేద్దాం?' అన్న ప్రశ్నలున్నాయి. ఆ ఇద్దరి కళ్లూ మౌనంగా మాట్లాడుకున్నాయి.

''మీ గుడిసెల్లో ఇంకా ఎందరు పిల్లలు అడుక్కుంటున్నారు?'' శ్రీధర్ అడిగాడు.

''ఇంకా ఐదారుగురున్నారు సార్'' అన్నాడు ఇస్మాయిల్.

''ఇదిగో నా అడ్రస్సు. రేపు ఆ పిల్లల్ని తీసుకుని రా. నేను వాళ్లని స్కూల్లో జేరుస్తాను. వాళ్ల ఖర్చులకి మీరు భయపడకండి. అవి మేము భరిస్తాము'' అంది శీతల భర్త అభిప్రాయాన్ని అర్థం చేసుకుని.

సుక్కమ్మ, పోశాలూ, ఇస్మాయిల్... చివరికి నర్సు గూడా ఇది నిజమా? అన్నట్లు చూశారు.

శీతల నవ్వుతూ తల పంకించింది.

కాసేపు తరువాత శీతలా శ్రీధర్ వస్తూ వస్తూ నర్సింగ్ హోం బిల్లు తామే చెల్లిస్తామని రిసెప్షన్‌లో చెప్పి బయటికి వచ్చారు. సుక్కమ్మకి మరో నాల్గు రోజుల తరువాత పూర్తిగా తగ్గాకే తన కొడుకుని తీసుకునొచ్చి తమని కలవమని చెప్పారు.

కారు ఇంటి దారి పడుతూండగా చెప్పాడు శ్రీధర్ ''ఈసారి చిల్డ్రన్ ఫిలిం తీస్తాను. ఆ పిక్చర్‌తో వచ్చే డబ్బు ఈ పిల్లల భవిష్యత్ పథకాలకి వాడదాం''

''ఊహు! ఓ ట్రస్ట్ ఏర్పాటు చేద్దాం. నాకయితే ఆ పిల్లాడు మన శివాజీ ప్రతిబింబంలా అనిపించాడు. ఇలాటి వాళ్లకి అందవలసిన సహకారం అందకపోతే ఎందరో గాంధీలూ, నెహ్రూలూ ఇలా ప్రతి జంక్షన్ దగ్గరా ప్రమాదాలకి గురవుతూ బ్రతుకుపోరాటం సాగిస్తారు'' అంది శీతల. నిజమే అంటూన్న శ్రీధర్ కళ్లకి 'నాన్నా! నా సినిమా తియ్యవూ?' అంటున్న శివాజీ రూపం గోచరించింది. ఆ రూపం నుంచి అనేక రూపాలు విశ్వమంతా వ్యాపిస్తూ సాయం కోసం చెయ్యి చాస్తున్నట్లు అనూహ్యమైన స్పందన.

